## క్లుప్తంగా

### ముప్కాల్ ఎంపీడీవోగా బాధ్యతలు



బాల్కొండ : ముప్కాల్ మండల ఎంపీడీవోగా రమేశ్ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బాలగంగాధర్ రుద్రూర్ కు బదిలీపై వెళ్లారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ నుంచి ముప్కాల్‌కు రమేశ్ బదిలీపై వచ్చారు. నూతన ఎంపీడీవోను స్థానిక కార్యాలయం సిబ్బంది ఆహ్వానించి, సన్మానించారు. ఎంపీవో గౌస్ మోహినొద్దీన్, ఏపీవో శకుంతల, ముప్కాల్ పంచాయితీ కార్యదర్శి మల్లేష్ యాదవ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

బోధన్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. గంగాధర్ అప్ప, పల్లపు వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ శివారులోని బెల్లాల్, పసుపువాగు ప్రాంతంలో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యాన్ని వారు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులను నుంచి సేకరించి ధాన్యాన్ని వెనువెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. నాయకులు యేశాల గంగాధర్, ఎల్లప్ప, పోశెట్టి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### జీపీ కార్యదర్శి తీరుపై నిరసన

రుద్రూర్: పొతంగల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నాడని శుక్రవారం పొతంగల్ మండల కేంద్రంలో స్థానికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనుల నిమిత్తం జీపీ కార్యాలయానికి వెళితే సరైన సమాధానం ఇవ్వరని వాపోయారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి తరలివెళ్లి ఎంపీడీవో చందర్ కు వినతిపత్రం అందజేశారు. బజరంగ్ హన్మాండ్లు, శేఖర్, నవీన్, సాయిలు, గంగారాం, లక్ష్మణ్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం, పీసీసీ ప్రెసిడెంట్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

కమ్మర్‌పల్లి: జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం కమ్మర్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సీఎం, పీసీసీ ప్రెసిడెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు పడిగెల ప్రవీణ్, సల్లూరి గణేష్, గుడిసె అంజమ్మ, నూకల బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, గోపిడి లింగారెడ్డి, నరేందర్, శైలేందర్, సింగిరెడ్డి, శేఖర్, కొమ్ముల రవీందర్, నాగరాజు, పూజారి శేఖర్ ,సింగిరెడ్డి ప్రతాప్, ఆల్గోట్ రంజిత్, వేములవాడ జగన్, కిషన్, సుంకరి గంగాధర్, కంపదండి అశోక్ తదితరులు పాల్గొన్నారు

### మురుగు కాలువలు నిర్మించాలి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని 15వ వార్డు లోగల పాన్ గల్లీలో మురుగు కాలువలు నిర్మించాలని కాలనీవాసులు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడారు. కాలనీ వాసులు కంది కట్ల వాసు, మోహన్, అశోక్, నిఖిల్, సంజయ్‌లు పాల్గొన్నారు.

### గాంధారికి బస్సు సర్వీసు నడపాలి

వర్ని : బోధన్ నుంచి వయా వర్ని బడాపహాడ్ మీదుగా గాంధారి వరకు ఆర్టీసీ బస్సు నడపాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. బోధన్ నుంచి గాంధారి కి రాత్రి సర్వీసు నడిపించాలని దీంతో బడా పహాడ్ దర్గాకు వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అలాగే ఆర్టీసీకి ఆదాయం సమకూరుతందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పీసీసీ డెలిగేట్ డాక్టర్ కునిపూర్ రాజిరెడ్డి, కొండలవాడి శంకర్ లు ఉన్నారు.

### రోబోటిక్స్‌పై అవగాహన


ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు భౌతిక శాస్త్ర విభాగం సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్ అకాడమీ (ఆర్ఐఏ) శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ చంద్రిక శుక్రవారం తెలిపారు. విద్యార్థులు రోబోటిక్స్ ప్రాథమిక సిద్ధాంతాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రాక్టికల్ ప్రాజెక్టులపై పనిచేయడం ద్వారా నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నట్లు తెలిపారు.

### ఎమ్మార్పీఎస్ నాయకుల ధర్నా

రెంజల్/నవీపేట : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసనగా రెంజల్, నవీపేట తహసీల్దార్ కార్యాలయాల ముందు శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడిన న్యాయవాదిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

# రైతులు మద్దతు ధరను పొందాలి

- పలు చోట్ల ధాన్యం, మక్క కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- రైతులు దళారులను ఆశ్రయించొద్దని ప్రజాప్రతినిధులు, అధికారుల సూచన



భవానిపేటలో కేంద్రాన్ని తనిఖీచేస్తున్న సబ్ కలెక్టర్



తిమ్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ రొక్కం మురళి

మాక్లూర్/నందిపేట్/వర్ని/మోర్తాడ్/బోధన్‌రూరల్ : రైతులు మద్దతు ధరలను వినియోగించుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. రైతుల దళారులను ఆశ్రయించి మోసపోవొద్దని సూచించారు. మాక్లూర్ మండలం ముల్లంగి(బి), గొట్టిముక్కల గ్రామాలలో శుక్రవారం మాక్లూర్ విండో తాజా, మాజీ చైర్మన్ బూరోల్ల అశోక్, తహసీల్దార్ శేఖర్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ కార్తిక్‌రెడ్డి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే కుద్వాన్‌పూర్ సొసైటీ పరిధిలోని దత్తాపూర్, తొండకూర్, కుద్వాన్‌పూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వర్ని మండలం పైడిమల్ గ్రామంలో జాకోరా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్ బాబా ప్రారంభించారు. మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రొక్కం మురళి, తహసీల్దార్ కృష్ణ ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోధన్ మండలంలోని భవానీపేట్, సంగం గ్రామాల్లో సబ్ కలెక్టర్ వికాస్ మహతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంబంధింత అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు తీరుపై ఆరా తీశారు. ఈసందర్భంగా ధాన్యం కొనుగోలు రికార్డులను పకడ్బందీగా నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దీపెంతలకు డిమాండ్



రోడ్డు పక్కన విక్రయిస్తున్న దీపెంతలను కొనుగోలు చేస్తున్న మహిళలు



దీపెంతలు

- ఈనెల 21న దీపావళి పండుగ
- జోరుగా సాగుతున్న విక్రయాలు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణ మార్కెట్‌లో దీపావళి శోభ ప్రారంభమైంది. ఈనెల 21న దీపావళి పండుగ జరగనుంది. దీంతో షాపుల ఎదుట వరుసగా అమర్చిన రంగురంగుల మట్టి దీపాలు, గాజు దీపెంతలు, విద్యుత్ అలంకరణ లైట్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. పట్టణంలోని ప్రధాన కూడలీల వద్ద, అలాగే పలు దుకాణదారులు తమ దుకాణాల మందు దీపెంతలు విక్రయిస్తున్నారు. స్థానిక మార్కెట్‌కు బొంబాయి, కలకత్తా, గుజరాత్ నుంచి తెచ్చిన వివిధ రకాల దీపాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. వీటి ధర రూ.5 నుంచి ప్రారంభమై రూ.500 వరకు ఉన్నాయి. చిన్న మట్టి దీపాల నుంచి పెద్ద అలంకార దీపాల వరకు వివిధ రకాల్లో ఉండటంతో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పండుగ కోసం ఇళ్లను అలంకరించేందుకు విస్తృతంగా దీపెంతలను మహిళలు కొనుగోలు చేస్తున్నారు. పండుగ సమీపిస్తుండటంతో దీపాల వెలుగులు, మార్కెట్ సందడి చూసిన వారందరికీ దీపావళి శోభ ఆకర్షణీయంగా మారింది.

### వివిధ రకాల డిజైన్లలో..

ఈసారి దీపావళి కోసం కొత్త డిజైన్స్ దీపెంతలు బాగా అమ్ముడవుతున్నాయి. బొంబాయి, గుజరాత్ నుంచి తెచ్చిన దీపెంతలకు డిమాండ్ ఉంది. రూ.5 నుంచి రూ. 500ల విలువ గల పెద్ద డిజైన్లలో దీపెంతలు ఉన్నాయి. కొనుగోళ్లతో మార్కెట్ ఉత్సాహంగా ఉంది. –రవి, వ్యాపారి,ఆర్మూర్

### మట్టి దీపెంతలకు డిమాండ్

స్వదేశీ మట్టి దీపెంతలకు మంచి డిమాండ్ ఉంది. కొత్త డిజైన్లతో ఉన్న విద్యుత్ లైట్లు వెలిగించేందుకు ఈసారి కొనుగోలు చే శాం. అందరి ఇళ్లలో వెలుగుల నింపే పండుగ. –మాధవి, ఆర్మూర్

# అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడిరాకేశ్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఆర్మూర్ రైతు వేదికలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పైడిరాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్ : అన్ని రంగాల్లో ఆర్మూర్ పట్టణం అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు వార్డులను శుక్రవారం అదనపు కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి పర్యటించారు. వర్షాలకు ధ్వంసమైన డ్రెయినేజీలు, రోడ్లను తిరిగి నిర్మించాలన్నారు. పట్టణానికి ప్రభుత్వం రూ. 47కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. ఇరిగేషన్ భూముల సమీపంలో కట్టడాలు వెంటనే ఆపివేయాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆర్మూర్ మార్కెట్ యార్డ్‌లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు, అలాగే ఆర్మూర్ రైతు వేదికలో 224మంది లబ్ధి దారులకు కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆర్మూర్, కోటార్మూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూంలను అర్హులకు పంపిణీ చేస్తామన్నారు. అధికారులు, బీజేపీ నాయకులు మందుల బాలు, కలిగొట గంగాధర్, పోల్కం వేణు, తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



వాడిలో చెక్కులు అందజేసిన కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్: వేల్పూర్ మండలం వాడిలో నలుగురు బాధితులకు కలిపి మంజూరైన రూ. 2,10,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్దం మహేందర్, రెడ్డొల్ల మహేందర్, అంకం రమేశ్, కాశం సాయికృష్ణ, నాగవేణు, నర్సయ్య, అశోక్, సతీష్, మోహన్, మధు, మల్లేష్, భూషణ్ పాల్గొన్నారు.

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం వన్నెల్ కే, కంఠం గ్రామాలలోని ఇద్దరు బాధితులకు కలిపి మంజూరైన రూ.38వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ అందజేశారు.సీనియర్ నాయకులు లోక హన్మండ్లు, తుక్కన్న, గొల్ల రాజేశ్వర్, కాంతం, చిన్నయ్య, సాగర్, షరీఫ్, మేకల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి వీడాలి



బోధన్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



నవీపేట అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ..

బోధన్: బీసీ రిజర్వేషన్ల అమలుపై బీజేపీ ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఆరునెలల క్రితం అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతికి పంపిన ఆమోదం తెలుపలేదని, ఇందుకు కేంద్రం ప్రభుత్వం చొరవ చూపలేదని పేర్కొన్నారు. మరో వైపు శనివారం బీసీ సంఘాలు బంద్ తలపెట్టగా ఇందులో బీజేపీ పాల్గొంటామని ప్రకటించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. పార్టీ జిల్లా ప్రతినిధులు నూర్జహాన్, వెంకటేశ్, శంకర్‌గౌడ్, యేశాల గంగాధర్, నన్నేసాబ్, సీనియర్ నాయకుడు గంగాధర్ అప్ప, జంగం గంగాధర్, మల్లేష్, సాగర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

#### అంబేడ్కర్ విగ్రహానికి వినతి

నవీపేట: స్థానిక ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. సీపీఎం నాయకులు నాయక్‌వాడీ శ్రీనివాస్, దేవేందర్‌సింగ్, మహబూబ్,షేక్ బాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ సంయుక్త జిల్లాల కార్యదర్శి వి ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్ మాట్లాడారు.

#### బంద్ విజయవంతం చేయాలి

మాక్లూర్/బోధన్ : రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి దుడ్డు గంగాధర్ వెల్లడించారు. శుక్రవారం మానిక్ బండారు వద్ద ఆయన మాట్లాడారు. అలాగే బంద్ విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సాలూర మండల అధ్యక్షుడు మందర్నా రవి పిలుపునిచ్చారు.

నందిపేట్(ఆర్మూర్): రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు కె.గంగాధర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నందిపేట మండల కేంద్రంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల ప్రజలు విజయవంతం చేయాలని కమ్మర్‌పల్లి జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం కమ్మర్‌పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అలాగే భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు కోరారు.

### కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు



వర్నిలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

వర్ని: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకమాడుతుందని బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లను కల్పించడంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. శనివారం జరుగు రాష్ట్ర వ్యాప్త బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని బందులో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు, కోటగిరి మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, చందూర్ సొసైటీ మాజీ అధ్యక్షులు మాధవరెడ్డి, నాయకులు తెల్ల రవి, గంగప్ప,ఎజాజ్, ఆనంద్, మధు, లక్ష్మణ్, బంజ గంగారాం పాల్గొన్నారు.

# జీవాలకు టీకాలు వేయించాలి



ఉప్లూర్‌లో టీకాలు వేస్తున్న ఏడీ డాక్టర్ గంగాధరయ్య



అచన్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి/బాల్కొండ : పాడి రైతులు తప్పనిసరిగా ఆరునెలలకోసారి జీవాలకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ గంగాధరయ్య సూచించారు.శుక్రవారం కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అలాగే మెండోర మండలం దూదిగాం గ్రామంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. పశువులకు ఆయన స్వయంగా టీకాలు వేశారు. డాక్టర్ రాజశేఖర్‌రావు, సిబ్బంది ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ గౌతమ్ రాజు, ప్రవీణ్,ప్రణీత్ గోపాలమిత్ర, మల్లేశ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్/మాక్లూర్/బోధన్‌రూరల్ : వేల్పూర్ మండలం కోమన్‌పల్లి లో పశువులకు పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, మాక్లూర్ మండలం గొట్టిముక్కలలో పశువైద్యాధికారి ఉమా సహేర్, బోధన్‌రూరల్ మండలంలో వైద్యురాలు పద్మ పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది ఉన్నారు.

### నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



ఆర్మూర్ టౌన్/కమ్మర్ పల్లి: :ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. ఆర్మూర్ అర్బన్ హెల్త్ సెంటర్, కమ్మర్ పల్లి, చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్లలోని మందుల నిల్వలను, అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్‌వో డా.నాగరాజ, వైద్యురాలు డాక్టర్ శ్రేయ, స్పందన సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పోచంపల్లిలో వరిపంట క్షేత్ర పరిశీలన

వేల్పూర్: వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం కార్యక్రమం కింద సాగుచేసిన ఆర్‌డీఆర్ 1200 వరి పంటను రుద్రూరు కృషి విజ్ఞాన క్షేత్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ రకం వరి పంట తెగుళ్లను తట్టుకొని ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ విత్తనం వానాకాలం పంటకు విత్తనంగా వాడుకోవచ్చని పేర్కొన్నారు. మిగిలిన విత్తనాన్ని ఇతర రైతులకు కూడా విక్రయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజు, ఏఈవో సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత పక్షోత్సవాలు



పెర్కిట్ కూడలిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పెర్కిట్/బాల్కొండ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో శుక్రవారం స్వచ్ఛత పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనతరం జాతీయ రహదారుల కూడలిలలో ప్రతిజ్ఞ చేశారు. అలాగే బాల్కొండలో జెడ్పీహెచ్‌శ్రీస్ విద్యార్థులు స్వచ్ఛ భారత్ చేశారు కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటరమణ చారి, రాజేష్, సురేష్, బాల్కొండలో ఎంఈవో బట్టు రాజేశ్వర్, ఇన్‌చార్జి హెచ్ఎం ఎం ప్రశాంత్ కుమార్, టీచర్లు పాల్గొన్నారు.

# మరమ్మతులు చేయాలని రాస్తారోకో



ఫకీరాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలోని గుంతలు పడ్డ రహదారికి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు శుక్రవారం రాస్తారోకో చేశారు. రైల్వే ట్రాక్ నిర్మాణ పనులతో పాటు బోధన్–భైంసా జాతీయ రహదారి నిర్మాణ పనులు సాగుతుండడంతో రహదారి పూర్తిగా మట్టితో కూరుకుపోయిందని వాపోయారు. నివాస గృహాలపై దుమ్ము, ధూళి కమ్ముకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారికి బీటీతో మరమ్మతులు చేయాలని నినాదాలు చేశారు. తహశీల్దార్ వెంకట రమణ అక్కడికి చేరుకుని గ్రామస్థలతో మాట్లాడారు. సంబంధిత అధికారులకు సమస్యను విన్నవిస్తానని హామీ ఇచ్చారు.

# అసభ్యంగా ప్రవర్తిస్తే షీ టీంకు ఫిర్యాదు చేయాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుహాసిని

డొంకేశ్వర్(ఆర్మూర్): మహిళలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్ చేసినా వెంటనే ఫిర్యాదు చేయాలని షీ టీం పోలీసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈవ్‌టీజింగ్, సైబర్ మోసాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందులో షీ టీం అధికారులు విఘ్నేశ్, సుమతి, ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం సురేష్ కుమార్ ఉన్నారు.

#### మెండోరా పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్

బాల్కొండ: మెండోరా పోలీస్‌స్టేషన్ లో ఎస్సై జే.సుహాసిని పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసుల విధులు, ఆయుధాలు, రికార్డులను విద్యార్థులకు వివరించారు. పోలీసుల విధులపై ఎస్సై మెండోరా జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుల రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు, కమాండ్ కంట్రోల్ రూం, ఆయుధాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

వేల్పూర్: ప్రభుత్వం ప్రకటించిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ రైతువిభాగం జిల్లా నాయకుడు మిట్టపల్లి మహిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి, ఇంకా ప్రారంభించడం లేదన్నారు.

### డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

నందిపేట్(ఆర్మూర్): మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు నందిపేట ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. నందిపేటలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా నిర్మల్ జిల్లా ముతాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు పట్టుబడటంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

### పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని చిన్నమావంది గ్రామంలో పేకాటస్థావరంపై శుక్రవారం బోధన్ రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

### సీసీ డ్రెయినేజీ పనులు ప్రారంభం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం బజార్ కొత్తూర్ గ్రామంలో శుక్రవారం సీసీ డ్రెయినేజీ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ ప్రారంభించారు. ఈజీఎస్ పథకంలో భాగంగా ఈ పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఆకుల లక్ష్మినారాయణ, గోపు ముత్యం, గడ్డం రాజు, తేలు నర్సయ్య, ఉరేట్టి నరేష్, పోశెట్టి, మచ్చల రాములు, మల్లయ్య, రాజేశ్వర్, గజేందర్ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

మాక్లూర్ : మండలంలోని దాస్‌నగర్ వద్ద గల మహాత్మ జ్యోతిబా పూలే జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మరియాల స్వప్న తెలిపారు. ఈమేరకు శుక్రవారం విద్యార్థినులు భవిత, పావని, పూజ కాలేజీలో కాలేజీ సిబ్బంది అభినందించారు.ఈకార్యక్రమంలో పీడీ ఎం నీరజ, పీఈటీ పి పావని ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

### సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

మాక్లూర్/డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్ జెడ్పీ పాఠశాలలో శుక్రవారం వైద్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఎవరికైనా హార్ట్ స్ట్రోక్ వచ్చినప్పుడు ఏ విధంగా సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చో అర్థమయ్యేలా బొమ్మ ద్వారా చూపించారు. అలాగే బ్రెస్ట్ క్యాన్సర్, యాంటీ టొబాకోపై అవగాహణ కల్పించారు. మెడికల్ ఆఫీసర్ శుభాకర్, వెంకటేశ్, హెచ్‌ఎం లింగారెడ్డి పాల్గొన్నారు. అలాగే మాక్లూర్ మండలంని కల్లెడి ప్రభుత్వ పాఠశాలలో సీపీఆర్‌పై జరిగిన అవగాహన సదస్సుకు డాక్టర్ ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, పంచాయితీ కార్యదర్శి శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వేల్పూర్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మోతె పీహెచ్‌సీ వైద్యాధికారి కీర్తన పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు.